A9 NEWS TELANGANA

మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం

R.NO. T/TG/2026/0111/2018/1268

విలేఖరులు కావలెను...
విశేష ఆదరణతో దూసుకుపోతున్న తెలుగు దినపత్రిక "మన ప్రజాగళం" పత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు, మండలల్లా వారీగా.మరియు నియోజకవర్గ ఇన్‌చార్జిలు, జిల్లా స్టాఫర్లు కావాలెను.
వివరాలకు సంప్రదించవలసిన పోన్ నెంబరు.
9390 875876

హైదరాబాద్ సంపుటి : 1 సంచిక 19 శనివారం 23 మే 2026 పేజిలు :08 వెల:రూ.5/-

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

- వడగాలులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- తెలంగాణలో వడదెబ్బతో 22 మంది మృతి
- ఏపీలో 48 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



**హైదరాబాద్, అమరావతి, మే 22(మన ప్రజాగళం):** తెలుగు రాష్ట్రాల్లో ఎండలు భగ్గుమంటున్నాయి. భానుడి ప్రతాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచే మండిపోతున్న ఎండలు మధ్యాహ్నానికి అగ్నిగుండంలా మారుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు రావొద్దని ప్రజలకు సూచించింది. తెలంగాణ రాష్ట్రంలో వడదెబ్బ తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. ఒక్కరోజులోనే వడదెబ్బ కారణంగా 22 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. రోహిణికార్తె మొదలుకాకముందే రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్, ఆదిలాబాద్, హన్మకొండ, రామగుండం, భద్రాచలం ప్రాంతాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కూడా వడగాలులు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. నగరంలో 42 నుంచి 43 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కపోత, వేడి గాలులతో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.
ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎండలు

మిగతా 2 లో..

అదనపు ఆదాయ

# వనరులపై దృష్టి పెట్టాలి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- లీకేజీలకు అడ్డుకట్ట వేసి బడ్జెట్ లక్ష్యాలు సాధించాలని ఆదేశం
- వనరుల సమీకరణ కేబినెట్ ఉపసంఘ సమావేశంలో కీలక సమీక్ష



**హైదరాబాద్, మే 22 (మన ప్రజాగళం):** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ అవసరాలకు అనుగుణంగా అదనపు ఆదాయ వనరుల సమీకరణపై అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేలా ప్రతి శాఖ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన "రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ" ఉన్నతస్థాయి సమావేశంలో
ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్

మిగతా 2 లో..

కిడ్నీ మార్పిడుల్లో అరుదైన

# ఘనత సాధించిన నిమ్స్

- 2 వేల కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్లతో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు
- నిమ్స్ వైద్య బృందానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు



**హైదరాబాద్, మే 22 (మన ప్రజాగళం):** కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల్లో అరుదైన మైలురాయిని అందుకున్న నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వైద్య బృందానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. నిమ్స్ యూరాలజీ విభాగం విజయవంతంగా 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి దేశవ్యాప్తంగా అరుదైన రికార్డు నమోదు చేసింది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు నూతన జీవితం అందించిన నిమ్స్ వైద్య సేవలు ప్రశంసనీయమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ల నిర్వహణలో దక్షిణ భారతదేశంలో నిమ్స్ మొదటి స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా గుజరాత్‌లోని ఐకేడీఆర్సీ మొదటి స్థానంలో, లూధియానాలోని క్రిస్టియన్ మెడికల్ కాలేజీ రెండో స్థానంలో ఉండగా, నిమ్స్ మూడో స్థానంలో నిలిచి విశిష్ట గుర్తింపు పొందింది. ప్రభుత్వ వైద్య సంస్థగా ఇంత పెద్ద స్థాయిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం వైద్య రంగంలో గొప్ప విజయంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, నిమ్స్ వైద్యులు, సిబ్బంది అంకితభావంతో సేవలు అందిస్తూ కిడ్నీ బాధితులకు ఆశాకిరణంగా నిలుస్తున్నారని అన్నారు. ఆధునిక వైద్య సాంకేతికత, నిపుణులైన వైద్య బృందం, ప్రభుత్వ మద్దతుతో నిమ్స్ దేశంలోనే ప్రముఖ వైద్య సంస్థగా ఎదుగుతోందని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. 2 వేల కిడ్నీ మార్పిడి
పొందిన రోగుల్లో 95 శాతం మంది అంటే దాదాపు

మిగతా 2 లో..

# గల్ఫ్ తెలంగాణ బిడ్డల ఓటు హక్కు కాపాడుతాం: కేటీఆర్

- ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఆర్ఎస్ ప్రత్యేక కార్యాచరణ
- కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలుస్తామని వెల్లడి

**నిజామాబాద్, మే 22 (మన ప్రజాగళం):** గల్ఫ్ దేశాల్లో జీవనోపాధి కోసం ఉన్న తెలంగాణ ప్రజల ఓటు హక్కు ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకుండా చూస్తామని కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా గల్ఫ్‌లో ఉన్న లక్షలాది తెలంగాణ ఎన్నారైలు తమ ఓటు హక్కులపై ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపడుతుందని వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని కూడా కలుస్తామని తెలిపారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నేతలతో నిర్వహించిన పార్టీ సమీక్ష సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణేష్ గుప్తా, జాజల సురేందర్, హన్మంత్ షిండే, మాజీ



మిగతా 2 లో..

# భారత్--సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

- ఢిల్లీలో ప్రధాని మోదీతో సైప్రస్ అధ్యక్షుడి భేటీ
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు
- వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో సహకారం విస్తరణ



**న్యూఢిల్లీ, మే 22 (మన ప్రజాగళం):** భారత ప్రధాని నరేంద్ర మోదీ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడిస్తో న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపినట్లు ప్రధాని మోదీ తెలిపారు. భారత్--సైప్రస్ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా అభివృద్ధి చేయాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. భారత్, సైప్రస్ దేశాల మధ్య ఉన్న సన్నిహిత బంధాలు ఉమ్మడి విలువలపై ఆధారపడి ఉన్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇరు దేశాలు మరింత సమగ్ర భాగస్వామ్యంతో ముందుకు



మిగతా 2 లో..

# రాజ్‌నాథ్‌తో సువేందు భేటీ




- న్యూఢిల్లీలో కీలక సమావేశం
- పశ్చిమ బెంగాల్ అభివృద్ధిపై చర్చ
- సువేందుపై రాజ్‌నాథ్ ప్రశంసలు

**న్యూఢిల్లీ, మే 22 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):**

2 లో..

# వెనిజువెలా ఆయిల్‌కు భారత్ మొగ్గు



2 లో..

# లష్కరేను కాపాడే ప్రయత్నాలు



ల2 లో..




# ఎగుమతిదారులకు కేంద్రం భరోసా

- వాణిజ్య వ్యవస్థ బలోపేతానికి చర్యలు
- పోర్టులు, ఎగుమతిదారులతో కేంద్ర మంత్రుల సమావేశం
- ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ప్రత్యేక దృష్టి



**న్యూఢిల్లీ, మే 22 (మన ప్రజాగళం):** భారత ఎగుమతిదారులు, దిగుమతిదారులు, పోర్టు అధికారులతో కేంద్ర ప్రభుత్వం కీలక సమావేశం నిర్వహించింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర పోర్టులు, నౌకాశ్రయాలు, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సంయుక్తంగా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. భారత వాణిజ్య వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత ఎగుమతిదారులు ప్రపంచ స్థాయిలో మరింత పోటీతత్వంతో ముందుకు సాగేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన

మిగతా 2 లో..

# అదనపు ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి



(మొదటి పేజీ తరువాయి..)

కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. వివిధ శాఖల అదనపు ఆదాయ వనరులు, వాటి పురోగతిపై మంత్రులు, ఉన్నతాధికారులు విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా ఆదాయ వనరుల సమీకరణ జరగాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ఆదాయానికి నష్టం కలిగించే లీకేజీలను పూర్తిగా అరికట్టాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. అందుబాటులో ఉన్న అన్ని ఆదాయ మార్గాలను పూర్తిస్థాయిలో వినియోగించి బడ్జెట్ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతి శాఖ ముందుగా నిర్ణయించిన క్యాలెండర్, టైమ్‌లైన్ ప్రకారం పనిచేస్తూ ఆదాయ వృద్ధికి కృషి చేయాలని చెప్పారు.

ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న సమీక్షా సమావేశాలకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని అన్ని శాఖల సీనియర్ అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అనివార్య కారణాల వల్ల ప్రత్యక్షంగా హాజరుకాలేని అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశాల్లో పాల్గొనాలని ఆదేశించారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఆదాయ వనరులను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. ఇప్పటికే కేబినెట్ తీసుకున్న నిర్ణయాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ధరలను మే 28 నుంచి పెంచుతున్నట్లు అధికారులు సమావేశంలో తెలిపారు. దీనివల్ల రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశముందని వెల్లడించారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన "హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్" కూడా ఖరారయ్యాయని, త్వరలో సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు జారీ కానున్నట్లు అధికారులు వివరించారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ, హెచ్ఎండీఏ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, గనులు, రెవెన్యూ, రవాణా శాఖల ప్రస్తుత ఆదాయ పరిస్థితి, భవిష్యత్ లక్ష్యాలపై సమావేశంలో సమగ్ర సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

# రాజ్‌నాథ్‌తో సువేందు భేటీ

(మొదటి పేజీ తరువాయి..)

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారితో సమావేశమయ్యారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. దేశ రాజకీయ పరిస్థితులు, పశ్చిమ బెంగాల్ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఈ సందర్భంగా చర్చ జరిగినట్లు సమాచారం. సమావేశం అనంతరం రాజ్‌నాథ్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో స్పందిస్తూ సువేందు అధికారిని ప్రశంసించారు. ఆయనకు గొప్ప రాజకీయ, శాసన అనుభవం ఉందని పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు సువేందు కృషి చేస్తారనే నమ్మకం తనకు ఉందని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఈ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్రంలో ప్రతిపక్ష బలం పెంచేందుకు భారతీయ జనతా పార్టీ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర నాయకత్వంతో సువేందు అధికారికి జరుగుతున్న వరుస సమావేశాలు చర్చనీయాంశంగా మారాయి. సువేందు అధికారి ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక నేతగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో అధికార పార్టీపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. వివిధ ప్రజా సమస్యలపై తరచూ ఉద్యమాలు చేపడుతూ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రాజ్‌నాథ్ సింగ్ చేసిన వ్యాఖ్యలు పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీశాయి. భవిష్యత్తులో రాష్ట్ర రాజకీయాల్లో సువేందు అధికారికి మరింత కీలక బాధ్యతలు వచ్చే అవకాశాలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్టీ జాతీయ నాయకత్వం ఆయనపై విశ్వాసం ఉంచుతున్న సంకేతాలుగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ భేటీ సందర్భంగా ఇతర రాజకీయ అంశాలపై కూడా చర్చ జరిగి ఉండవచ్చని సమాచారం. అయితే అధికారికంగా సమావేశానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించలేదు. పశ్చిమ బెంగాల్ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై కలిసి పనిచేయాలనే అంశంపై ఇద్దరు నేతలు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలుస్తోంది.



# వెనిజువెలా ఆయిల్‌కు భారత్ మొగ్గు

**మూడో అతిపెద్ద సరఫరాదారుగా వెనిజువెలా**

**తక్కువ ధరలతో భారత కంపెనీల ఆకర్షణ**

**ఇరాన్, ఇరాక్ సరఫరాలపై యుద్ధ ప్రభావం**

**న్యూఢిల్లీ, మే 22 (మన ప్రజాగళం):** భారతదేశానికి ముడి చమురు సరఫరా చేస్తున్న దేశాల జాబితాలో తాజాగా వెనిజువెలా కీలక స్థానాన్ని దక్కించుకుంది. సాధారణంగా ముందంజలో ఉండే సౌదీ అరేబియా, అమెరికా వంటి దేశాలను వెనక్కి నెట్టి మే నెలలో భారత్‌కు అత్యధికంగా ఆయిల్ సరఫరా చేసిన మూడో పెద్ద దేశంగా అవతరించింది. ప్రస్తుతం వెనిజువెలా నుంచి రోజుకు సుమారు 4.17 లక్షల బ్యారెళ్ల ముడి చమురు భారత్‌కు వస్తున్నట్లు అంతర్జాతీయ ఇంధన వర్గాలు వెల్లడిస్తున్నాయి. రష్యా, యూఏఈ మాత్రమే వెనిజువెలా కంటే ముందున్నాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొనడంతో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో ఇతర దేశాలతో పోలిస్తే తక్కువ ధరకే చమురును వెనిజువెలా అందిస్తోంది. ఇదే భారత కంపెనీలను ఆకర్షిస్తోంది. వెనిజువెలా నుంచి వచ్చే చమురులో సల్ఫర్ శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ, ఆధునిక సాంకేతికత కలిగిన రిఫైనరీలు దానిని సులభంగా శుద్ధి చేయగలుగుతున్నాయి. ముఖ్యంగా గుజరాత్‌లోని జామ్‌నగర్ రిఫైనరీతో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ చమురును పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు ప్రపంచ చమురు సరఫరా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి మార్గంలో రవాణా అంతరాయం ఏర్పడటంతో ఇరాక్ నుంచి భారత్‌కు వచ్చే చమురు సరఫరా భారీగా తగ్గిపోయింది. ఫిబ్రవరిలో రోజుకు 9.69 లక్షల బ్యారెళ్ల చమురు సరఫరా చేసిన ఇరాక్, మే నెలలో కేవలం 51 వేల బ్యారెళ్లకు మాత్రమే పరిమితమైంది. దీంతో భారత ఆయిల్ కంపెనీలు ప్రత్యామ్నాయ దేశాల కోసం ప్రయత్నాలు ప్రారంభించాయి. అటు అమెరికా నౌకాదళం ఇరాన్ పోర్టులపై కట్టుదిట్టమైన దిగ్బంధనం అమలు చేయడంతో అక్కడి నుంచి భారత్‌కు రావాల్సిన చమురు సరఫరా కూడా దాదాపు నిలిచిపోయింది. ఇరాన్ చమురు లేకపోవడం భారత మార్కెట్‌పై అదనపు ఒత్తిడిని పెంచింది. ఈ పరిస్థితుల్లో తక్కువ ధరకే చమురు అందిస్తున్న వెనిజువెలా భారత్‌కు కీలక ప్రత్యామ్నాయంగా మారింది.

ఇప్పటివరకు భారత్‌కు ప్రధాన సరఫరాదారుగా ఉన్న సౌదీ అరేబియా కూడా తన మార్కెట్ వాటాను కోల్పోతోంది. ఆ దేశం నుంచి వచ్చే చమురు ధరలు ఎక్కువగా ఉండటంతో భారత దిగుమతి సంస్థలు వెనిజువెలా వైపు మొగ్గు చూపుతున్నాయి. ఏప్రిల్ నెలలో సౌదీ నుంచి రోజుకు 6.70 లక్షల బ్యారెళ్ల చమురు దిగుమతి కాగా, మే నెలలో అది 3.40 లక్షల బ్యారెళ్లకు పడిపోయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో పాటు రూపాయి విలువ తగ్గడం వంటి ఆర్థిక సవాళ్లు కొనసాగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ ధరలకు లభిస్తున్న వెనిజువెలా చమురు భారత ఆర్థిక వ్యవస్థకు కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది. అయితే అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు, యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రమైతే భవిష్యత్తులో చమురు మార్కెట్‌లో ఇంకా అనిశ్చితి పెరిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# లష్కరేను కాపాడే ప్రయత్నాలు

**ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్ర శిబిరాల ధ్వంసం**

**తల్హా సయీద్‌ను ముందుకు తెచ్చే యత్నాలు**

**చైనా, అమెరికా ఒత్తిళ్లతో పాక్ ఆందోళన**

**న్యూఢిల్లీ, మే 22 (మన ప్రజాగళం):** భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు భారీ దెబ్బగా మారింది. పాకిస్థాన్‌లోని మురిద్కే ప్రాంతంలో ఉన్న ప్రధాన శిక్షణా కేంద్రాన్ని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసినట్లు సమాచారం. ఈ దాడులతో లష్కరే తోయిబా తీవ్ర ఆర్థిక, కార్యాచరణ సంక్షోభంలోకి వెళ్లినట్లు అంతర్జాతీయ భద్రతా వర్గాలు అంచనా వేస్తున్నాయి. సంస్థ కార్యకలాపాలు దెబ్బతినడంతో పాకిస్థాన్ సైన్యం, రాజకీయ వర్గాలు మళ్లీ దాన్ని బలోపేతం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇటీవల లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు అత్యంత సన్నిహితుడిగా భావించే రాణా సనావుల్లాతో ఫైసలాబాద్‌లో రహస్యంగా సమావేశమైనట్లు భారత నిఘా సంస్థలు గుర్తించాయి. ఈ సమావేశాల్లో లష్కరే భవిష్యత్ కార్యాచరణ, నాయకత్వ మార్పులు, ఉగ్రవాద కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణపై చర్చలు జరిగినట్లు సమాచారం. పాక్ సైన్యం, ఐఎస్ఐపై ఉగ్రవాద సంస్థల్లో విశ్వాసం తగ్గిపోవడంతోనే రాజకీయ నాయకులను రంగంలోకి దింపినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం 75 ఏళ్ల వయసులో ఉన్న హాఫీజ్ సయీద్ ఆరోగ్యం, వయస్సు కారణంగా సంస్థలో నాయకత్వ సంక్షోభం నెలకొన్నట్లు చెబుతున్నారు. దీంతో 50 ఏళ్ల తల్హా సయీద్‌ను అధికారికంగా ఆపరేషన్స్ చీఫ్‌గా నియమించాలని పాక్ వర్గాలు ఆలోచిస్తున్నాయి. డిజిటల్ టెక్నాలజీ, ఆన్‌లైన్ కమ్యూనికేషన్ వ్యవస్థలపై తల్హాకు మంచి పట్టుందని, ఆధునిక ఉగ్రవాద కార్యకలాపాలను సమన్వయం చేయగలడని భావిస్తున్నారు. లష్కరే తోయిబా భవిష్యత్తును నిలబెట్టేందుకు కొత్త తరం నాయకత్వం అవసరమని పాక్‌లోని కొన్ని వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇక పాకిస్థాన్‌కు బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూంక్వా ప్రాంతాల్లో భద్రతా సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాక్ సైన్యం తీవ్ర నష్టాలు ఎదుర్కొంటోంది. బీఎల్ఏ గ్రూపులు పాక్ ప్రభుత్వం లేదా సైన్యంతో చర్చలకు సిద్ధంగా లేవని తెలుస్తోంది. దీంతో లష్కరే తోయిబా నేతలను మధ్యవర్తులుగా ఉపయోగించి బీఎల్ఏతో పరోక్ష చర్చలు జరిపించాలని పాక్ వ్యూహం రచిస్తున్నట్లు సమాచారం. బలూచిస్థాన్ మీదుగా వెళ్లే చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ రెండో దశ ప్రాజెక్ట్‌కు భద్రత కల్పించడం ప్రస్తుతం పాకిస్థాన్‌కు పెద్ద సవాలుగా మారింది. ఈ ప్రాజెక్టులో చైనా భారీగా పెట్టుబడులు పెట్టగా, బలూచిస్థాన్‌లోని మైనింగ్ ప్రాజెక్టుల కోసం అమెరికా కూడా సుమారు 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టినట్లు నివేదికలు చెబుతున్నాయి. స్థానిక వనరులను దోచుకుంటున్నారంటూ బలూచ్ ప్రజలు ఈ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చైనా, అమెరికా పెట్టుబడులకు ముప్పు ఏర్పడకుండా చూడాలని పాకిస్థాన్‌పై అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది. తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకే పాక్ ప్రభుత్వం లష్కరే తోయిబా వంటి ఉగ్ర సంస్థలను మళ్లీ వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నట్లు భద్రతా నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే ఈ చర్యలు ప్రాంతీయ భద్రతకు మరింత ముప్పు తీసుకురావచ్చని అంతర్జాతీయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగ

(మొదటి పేజీ తరువాయి..)

విపరీతంగా పెరిగాయి. పల్నాడు జిల్లాలో నిన్న 48 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది. పిడుగురాళ్ల ప్రాంతంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. బాపట్ల జిల్లా వేటపాలెం, ప్రకాశం జిల్లా అద్దంకి ప్రాంతాల్లో 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా, మరో 150 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాలుల ప్రభావంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు మధ్యాహ్నం సమయాల్లో నిర్మానుష్యంగా మారుతున్నాయి. రైతులు, కూలీలు, రోడ్లపై పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చలివేంద్రాలు, తాగునీటి కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వైద్య నిపుణులు ప్రజలకు పలు జాగ్రత్తలు సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని, తగినంత నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ తీసుకోవాలని సూచిస్తున్నారు. పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు.ం

# కిడ్నీ మార్పిడుల్లో అరుదైన ఘనత సాధించిన నిమ్స్

(మొదటి పేజీ తరువాయి..)

1,900 మంది వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా చికిత్స పొందడం విశేషం. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఈ పథకాలు పెద్ద ఊరటనిస్తున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ వైద్య సేవల ద్వారా పేదలకు ఖరీదైన శస్త్రచికిత్సలు అందుబాటులోకి రావడం ఆరోగ్యరంగంలో కీలక ముందడుగుగా భావిస్తున్నారు. నిమ్స్ యూరాలజీ విభాగం గత మూడేళ్ల నాలుగు నెలల్లోనే 500 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి మరో రికార్డు సృష్టించింది. 2023 జనవరి నుంచి వేగవంతంగా ట్రాన్స్‌ప్లాంట్లు నిర్వహిస్తూ వైద్య సేవల విస్తరణలో కొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సమయానుకూలంగా చికిత్స అందించడంలో నిమ్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం, ఆధునిక సదుపాయాలు, వైద్యుల నైపుణ్యం కలిసివచ్చి నిమ్స్‌ను దేశంలోని ప్రముఖ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాల్లో ఒకటిగా నిలబెట్టాయి. భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులు తెలిపారు.

# గల్ఫ్ తెలంగాణ బిడ్డల ఓటు హక్కు కాపాడుతాం: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి..)

ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ ప్రక్రియపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ ప్రజల ఓటు హక్కులు తొలగిపోకుండా పార్టీ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే వందలాది మంది ఎన్నారైలు తమ స్థానిక ప్రజాప్రతినిధులకు ఫోన్లు చేసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి తెలంగాణ ఎన్నారైల ఓటు హక్కులను రక్షించేలా విజ్ఞప్తి చేస్తామని వెల్లడించారు. దీనికోసం పార్టీ తరఫున సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కూడిన ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి పంపనున్నట్లు కేటీఆర్ తెలిపారు. అలాగే స్థానిక స్థాయిలో పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అసిస్టెంట్లు గల్ఫ్‌లో ఉన్న ఓటర్ల వివరాలు సేకరించి సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్కరి ఓటు హక్కు కూడా తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని కేటీఆర్ కోరారు. ప్రతి బూత్ పరిధిలో గల్ఫ్‌లో ఉన్న ఓటర్ల వివరాలు సేకరించి ఎన్నికల కమిషన్ వద్ద అవసరమైన సమాచారం సమర్పించాలని సూచించారు. పార్టీ తరఫున నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమీక్ష సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కూడా చర్చ జరిగింది. బీఆర్ఎస్ ప్రారంభ దశ నుంచే నిజామాబాద్ జిల్లా పార్టీకి బలమైన కోటగా నిలిచిందని కేటీఆర్ గుర్తుచేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అవకాశంగా తీసుకొని పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సూచించినట్లుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని సమావేశంలో పాల్గొన్న నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు, యువత, మహిళలు సహా అనేక వర్గాలు ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నాయని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల నాటికి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేసి తిరిగి విజయం సాధించేందుకు కృషి చేస్తామని నేతలు తెలిపారు.

# భారత్--సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

(మొదటి పేజీ తరువాయి..)



సాగనున్నాయని తెలిపారు. పరస్పర సహకారంతో ప్రపంచస్థాయిలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయని చెప్పారు. వాణిజ్య, పెట్టుబడి రంగాల్లో భారత్--సైప్రస్ సంబంధాలు వేగంగా విస్తరిస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య పెట్టుబడుల ప్రవాహం పెరగడం ఆనందదాయకమని తెలిపారు. రానున్న రోజుల్లో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. సాంకేతికత, సముద్ర రవాణా, సేవల రంగం, మౌలిక వసతులు వంటి విభాగాల్లో సహకారం పెంపుపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. వ్యాపార అవకాశాలను విస్తరించడం ద్వారా ఇరు దేశాల ఆర్థిక వ్యవస్థలకు ప్రయోజనం కలుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ వేదికలపై పరస్పర మద్దతును కొనసాగించేందుకు కూడా అంగీకరించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడిస్ భారతదేశంతో సంబంధాలను మరింత బలోపేతం చేయాలని తమ దేశం ఆకాంక్షిస్తోందని తెలిపారు. భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం తమ దేశానికి ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య ఉన్న స్నేహబంధం భవిష్యత్తులో మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ ద్వారా భారత్--సైప్రస్ సంబంధాలు కొత్త దశలోకి అడుగుపెట్టాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడులు, వాణిజ్యం, సాంకేతిక రంగాల్లో సహకారం పెరగడం ద్వారా రెండు దేశాలకు ఆర్థికంగా లాభం చేకూరే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక రంగాల్లో కూడా ఈ భాగస్వామ్యం కీలకంగా మారనుందని విశ్లేషిస్తున్నారు.

## ఎగుమతిదారులకు కేంద్రం భరోసా

(మొదటి పేజీ తరువాయి..)

పరిష్కరించేందుకు సమన్వయంతో కూడిన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. "హోల్ ఆఫ్ ది గవర్నమెంట్" విధానంతో అన్ని శాఖలు కలిసి పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత వాణిజ్య రంగాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి వెల్లడించారు. పోర్టుల అభివృద్ధి, సరుకు రవాణా వేగవంతం, ఎగుమతి విధానాల్లో సరళీకరణ ద్వారా వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. దేశీయ వ్యాపార వ్యవస్థను మరింత సులభతరం చేయడమే లక్ష్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పీయూష్ గోయల్ తెలిపారు. వ్యాపార అనుమతులు, రవాణా, దిగుమతి-ఎగుమతి ప్రక్రియలను పారదర్శకంగా మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వ్యాపారులకు తక్కువ సమయంలో సేవలు అందేలా డిజిటల్ విధానాలను విస్తరిస్తున్నామని వెల్లడించారు. కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ భారత పోర్టులను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. సరుకు రవాణాలో జాప్యాలు తగ్గించి, ఎగుమతిదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు పోర్టు మౌలిక వసతులను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. సముద్ర రవాణా రంగంలో భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎగుమతిదారులు, దిగుమతిదారులు, పోర్టు అధికారులు తమ సమస్యలు, సూచనలు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వాణిజ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వారు స్వాగతించారు. భవిష్యత్తులో భారత వ్యాపార రంగానికి మరిన్ని అవకాశాలు కల్పించే విధంగా విధానాలు అమలు చేయాలని కోరారు.

## ఘనంగా తెలంగాణ దళిత ఉద్యమ వైతాళికుడు

# భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలు



జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:** తెలంగాణ దళిత ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు, ప్రముఖ సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శుక్రవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ దళిత ఉద్యమ వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, జనగామ మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లు భాగ్యరెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పిస్తూ, సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ భాగ్యరెడ్డి వర్మ తన జీవితాన్ని అణగారిన వర్గాల సామాజిక, విద్యా, ఆత్మగౌరవ ఉద్యమాలకు అంకితం చేశారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత, అస్పృశ్యత నిర్మూలన కోసం ఆయన నిరంతరం కృషి చేశారని తెలిపారు. హైదరాబాద్ సంస్థాన కాలంలోనే దళిత బాలికల విద్యాభివృద్ధికి పాఠశాలలను స్థాపించి, విద్యా చైతన్యానికి పునాదులు వేశారని గుర్తుచేశారు. భాగ్యరెడ్డి వర్మ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకమని, సమాజంలో సమాన అవకాశాలు, సామాజిక న్యాయం, మానవ విలువలను బలోపేతం చేయడంలో ఆయన ఆలోచనలు ఇప్పటికీ ప్రాసంగికంగా ఉన్నాయని పేర్కొన్నారు. యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు, పలు సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొని, ఈ మహనీయుడి సేవలను స్మరించుకుంటూ నివాళులర్పించారు.



## బచ్చన్నపేట తెలంగాణ ఉద్యమకారుల

# మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**బచ్చన్నపేట మే 22 మన ప్రజా గళం**

బచ్చన్నపేట తెలంగాణ ఉద్యమకారుల మండల అధ్యక్షుడిగా కోనేటి స్వామి, ప్రధాన కార్యదర్శిగా రాపెల్లి వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమమే ధ్యేయంగా బచ్చన్నపేట మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక శ్రీ దుర్గామాత దేవస్థాన ప్రాంగణంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 30 మంది మలిదశ ఉద్యమకారులతో ముఖ్య సమావేశం నిర్వహించారు.?ఈ సందర్భంగా పలువురు ఉద్యమకారులు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని జైలుపాలైన, పోలీస్ కేసులు మరియు బైండోవర్లు ఎదుర్కొన్న వారిని గుర్తించి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యమ సమయంలో కుటుంబ సభ్యులను కోల్పోయి, ప్రస్తుతం ఆర్థికంగా నిస్సహాయ స్థితిలో ఉన్న ఉద్యమకారుల కుటుంబాల హక్కుల సాధన కోసం, వారి సంక్షేమం కోసం ఈ కమిటీ నిరంతరం పాటుపడుతుందని తీర్మానించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు సీమ శ్రీనివాస్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ నందగిరి రజినీకాంత్, జనగామ జిల్లా అధ్యక్షులు గుజ్జుక రాజు, జిల్లా కన్వీనర్ కండింగుల బాలకృష్ణ, మరియు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈగం శ్రీనివాస్ ల ప్రత్యేక ఆమోదంతో.. కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు కమిటీ గౌరవ సలహాదారులు: నల్లగోని బాలకిషన్, బోడిగం చంద్రారెడ్డి, దొంతుల చంద్రమౌళి, బోడ కుంటి మల్లయ్య. అధ్యక్షుడు: కోనేటి స్వామి. ఉపాధ్యక్షులు: బొమ్మెన ఆంజనేయులు, వేముల లక్ష్మణ్ గౌడ్, నీల రమేష్, బోడిగం శ్రీపాల్ రెడ్డి. ప్రధాన కార్యదర్శి: రాపెల్లి వెంకటేశ్వర్లు. సహాయ కార్యదర్శులు: గంధ మల్ల నరేందర్, కాపర్తి హరిప్రసాద్, మునిని బాబు. కోశాధికారి: బంగారు మహేష్. కార్యవర్గ సభ్యులు: ఎండీ జావేద్, పిడుగు మహేష్, పోచంపల్లి శివకుమార్, జూకంటి కిష్టయ్య, నూకల రాజిరెడ్డి, నర్రా భూపాల్ రెడ్డి, ఎండీ షబ్బీర్, జేరిపోతుల అంజయ్య, కంసాని సిద్ధారెడ్డి. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు కోనేటి స్వామి, రాపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, మండల ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలిపారు. మండల పరిధిలోని ఉద్యమకారులందరినీ ఒకే తాటిపైకి తెచ్చి, ప్రభుత్వం నుంచి రావాల్సిన గుర్తింపు, సంక్షేమ ఫలాలు అందేలా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బహుజన రాజ్యాధికారమే లక్ష్యం...

## జులై మొదటి వారంలో టీఆర్పీ భారీ బహిరంగ సభ..

## టీఆర్పీ సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభం...

## ప్రతి ఇంటా పార్టీ జెండా ఎగురవేయడమే మా లక్ష్యం: కట్ల సదానందం.!

**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:** బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతానికి కృషి చేయనున్నట్లు ఆ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం తెలిపారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు.. జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కట్ల సదానందం మాట్లాడుతూ. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి గ్రామంలో కమిటీలు వేస్తామని, విద్యార్థి, కార్మిక, మహిళా, యువజన విభాగాలను బలోపేతం చేస్తామని తెలిపారు. రూ. 200 రుసుముతో సభ్యత్వ నమోదును ముమ్మరం చేయాలన్నారు. సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు రూ. 5 లక్షల ప్రమాద బీమా, అంగవైకల్యం కలిగితే రూ. 2.5 లక్షల ఆర్థిక సహాయం అందించి బహుజన వర్గాలకు భరోసా ఇస్తామన్నారు. జులై మొదటి వారంలో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే వేదికపై పార్టీలో చేరిన పలువురు నూతన కార్యకర్తలకు ఆహ్వానం పలికారు. జనగామ జిల్లా నూతన ఉపాధ్యక్షులను నియమించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్, మురళి బైండ్ల, యూత్ జిల్లా అధ్యక్షులు మంద దిలీప్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు ఎండి బబ్బులు, పట్టణ అధ్యక్షులు గడ్డం కృష్ణ, యూత్ మండల అధ్యక్షులు ముక్క విష్ణువర్ధన్, లింగాల గణపురం మండల అధ్యక్షులు శాడ నరేష్, ప్రధాన కార్యదర్శి ఆకుల నర్సింహులు, రఘునాథపల్లి మండల అధ్యక్షులు అశోక్ శంకరి గౌడ్, నర్మెట మండల అధ్యక్షులు శ్రీకాంత్, జలీల్ పాషా, శివార్ల ఎలేందర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# డీసీపీ చిత్రం తో ఆకట్టుకున్న విద్యార్థి సృజన్.

**జనగామ జిల్లా ప్రతినిధి, మన ప్రజాగళం:**



జనగామ సోషల్ వెల్ఫేర్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సృజన్, జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్ చిత్రాన్ని పెన్సిల్‌తో గీసి అందజేశాడు. చిత్రాన్ని చూసిన డీసీపీ సృజన్ ప్రతిభను అభినందిస్తూ, చదువుతో పాటు ఇలాంటి రంగాల్లో కూడా ముందుకు వెళ్లాలని సూచించారు. భవిష్యత్తులో విద్యా మరియు చిత్రలేఖనం విషయంలో ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. సృజన్‌లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన అతని గురువు కాసాల సంతోష్ కుమార్ ని కూడా డీసీపీ అభినందించారు. సృజన్ తండ్రి నర్సింగరావు , తల్లి స్వప్నప్రియ ప్రోత్సాహం ఎంతగానో ఉంది.

# నూతన ట్రాన్స్ఫార్మర్ ప్రారంభం..

# హర్షం వ్యక్తం చేసిన రైతులు

**బచ్చన్నపేట మే 22 మన ప్రజాగళం**



బచ్చన్నపేట మండలంలోని కేసిరెడ్డిపల్లిలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ను లైన్ మెన్ శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామంలో తరచూ ఎదురవుతున్న లో వోల్టేజ్ లోడు సమస్య పరిష్కరించేందుకు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని పేర్కొన్నారు. రైతులు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అసిస్టెంట్ లైన్ మెన్ పర్శారాములు, కట్టర్ బత్తిని ఆంజనేయులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకరణ్ గ్రామపంచాయతీకి బెస్ట్ బయో డైవర్సిటీ అవార్డు



**సంగారెడ్డి ప్రతినిధి,మన ప్రజాగళం**

అంతర్జాతీయ బయోడైవర్సిటీ డే పురస్కరించుకొని హైదరాబాద్ లో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణలోని సంగారెడ్డి జిల్లా కంది మండలం ఇంద్రకరణ్ గ్రామపంచాయతీకి బెస్ట్ బయో డైవర్సిటీ గా అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బయోడైవర్సిటీ బోర్డ్ సెక్రటరీ కాల్చరణ్ ఐఏఎస్ అహ్మద్ నదీమ్ సెక్రటరీ ఎన్విరాన్మెంట్ ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ,, శిల్పి శర్మ రీజనల్ కోఆర్డినేటర్ టీజీ బీడీపీ,వెంకట్ డిస్ట్రిక్ట్ బయోడైవర్సిటీ కోఆర్డినేటర్ సంగారెడ్డి, గ్రామ సర్పంచ్ శంకరి రాజు,గ్రామ పంచాయితీ సెక్రటరీ వీఎస్ఎస్ వాణి తదితరులు పాల్గొన్నారు.

# శిలాఫలకాలు ధ్వంసం చేయడం దుర్మార్గం గ్రామ ప్రజల ఆగ్రహం?

**బచ్చన్నపేట మే 22 మన ప్రజాగళం**

గ్రామాభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని పడమర కేశపూర్ గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శిలాఫలకంలో తన పేరు లేదనే కక్ష, అక్కస్సుతోనే ఈ దారుణానికి ఒడిగట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి పనుల గుర్తింపుగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఇలా వ్యక్తిగత కక్షలతో ధ్వంసం చేయడం సరైన పద్ధతి కాదని వారు హితవు పలికారు.?పబ్లిక్ ఆస్తులను, గ్రామానికి సంబంధించిన అధికారిక ఫలకాలను పాడుచేసిన ఇలాంటి వారిపై ఉన్నతాధికారులు, పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



## రైతులకు భరోసా... చివరి గింజ వరకు

# ప్రభుత్వమే కొనుగోలు

### కొండాపూర్--గొల్లపల్లి సొసైటీల్లో కేంద్రాలను ప్రారంభించిన టీజీఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి



**రంగారెడ్డి ప్రతినిధి మన ప్రజాగళం..**
రైతులు పండించిన జొన్న పంటను చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం కొండాపూర్, గొల్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.గొల్లపల్లి సొసైటీ చైర్మన్ ఎల్. శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని రైతులతో మాట్లాడారు. రబీ సీజన్‌లో కొండాపూర్ ప్రాంత రైతులు అధికంగా జొన్న సాగు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వం క్వింటాల్ జొన్నలకు రూ.3,699 మద్దతు ధర ప్రకటించిందని తెలిపారుమార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించాలని సూచించారు. దళారులకు అమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతుకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.గొల్లపల్లిలో రైతులతో మాట్లాడిన నిర్మల జగ్గారెడ్డి, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్. కొండాపూర్ సొసైటీ సిరాజ్. సొసైటీ చైర్మెన్లు శ్రీకాంత్ రెడ్డి. మాణిక్యరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, , మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుదాస్ జనరల్ సెక్రెటరీ నర్సింహులు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆయిల్ రెడ్డి గారీ నరసింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్. కిషన్ నాయక్, ప్రభాకర్, అశోక్, జాకీర్, బాల్‌రాజ్ గౌడ్, సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లోడింగ్, ఆన్ లోడింగ్ లో వేగం పెరగాలి

### ఓపీఎంఎస్ లో అప్డేట్ ఉండాలి
### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ ప్రతినిధి, మన ప్రజాగళం:**
కొనుగోలు అయిన ధాన్యన్ని త్వరగా మిల్ లకు తరలించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు శుక్రవారం..జనగామ మండలం శామీర్ పేట్ లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా సందర్శించారు ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్ర నిర్వాహకులని కొనుగోలు ప్రక్రియ, రవాణా గురించి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు ఇప్పటి వరకు కొనుగోలు అయిన ధాన్యం ఎంత...సీరియల్ ప్రకారం చేస్తున్నారా లేదా....లోడింగ్ అయ్యి ఎన్ని లారీ లు మిల్ లకు వెళ్లాయి అని తదితర వివరా లను అడిగి తెలుసుకున్నారు అనంతరం కలెక్టర్ కేంద్ర నిర్వాహకులకు పలు సూచనలు ఇస్తూ....సీరియల్ ప్రకారమే ధాన్యం మిల్ లకు వెళ్లాలని,సరిపడా లేబర్ ని పెట్టుకొని త్వరగా లోడింగ్, ఆన్ లోడింగ్ జరగాలని, ట్యాబ్ ఎంట్రీ లో ఆలస్యం ఉండకూడదని కలెక్టర్ తెలిపారు



# ప్రజల భాగస్వామ్యంతోనే జిల్లా అభివృద్ధి

- ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికపై జనగామ జిల్లా స్థాయి సమావేశం
- సంక్షేమ పథకాల అమలులో ప్రజలే కేంద్రబిందువు
- రైతులు, మహిళలు, యువతకు ప్రభుత్వం అండ



**జనగామ, మే 22 మన ప్రజాగళం:**
అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమిష్టి కృషితోనే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం 99 రోజుల "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన ఫలితాలు అందిస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, మున్సిపల్ ఛైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీసీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించారు. ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కేవలం పరిపాలనా కార్యక్రమం కాదని, ప్రజాస్వామ్య పాలనకు ఆచరణాత్మక రూపమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను నేరుగా తెలుసుకొని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తోందన్నారు. రైతు భరోసా ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రైతు ఎప్పుడూ ఒంటరిగా ఉండకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మహిళల ఆర్థిక భారం తగ్గించేందుకు మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. ఇందిరా మహిళా శక్తి, వడ్డీ లేని రుణాల ద్వారా మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. పంటల మార్పిడి, సేంద్రీయ వ్యవసాయానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు.

జిల్లాలో అమలవుతున్న పథకాల పురోగతిని అధికారులు వివరించారు. యాసంగి పంట కాలానికి సంబంధించి 1,85,504 మంది రైతులకు రూ.152 కోట్లకు పైగా రైతు భరోసా నిధులు జమ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో 5.64 లక్షల మందికి పైగా రేషన్ బియ్యం అందుతోందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 97 వేల మందికి పైగా లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందుతోందని తెలిపారు. అలాగే జిల్లాలో 74 వేల మందికి పైగా వృద్ధులు, వితంతువులు, ఇతర లబ్ధిదారులకు ప్రతి నెలా పింఛన్లు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో మొదటి విడతలో 5652 ఇళ్లు మంజూరై, వాటిలో 94 శాతం గ్రౌండింగ్ పూర్తి కావడం రాష్ట్రంలో రెండో స్థానమని అధికారులు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికే రూ.155 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ.58 కోట్లకు పైగా బ్యాంకు లింకేజ్ చెక్కులు అందజేశారు. మహిళా సంఘాలకు అగ్రో ప్రాసెసింగ్ యూనిట్ల కోసం ఆర్థిక సహాయం కూడా పంపిణీ చేశారు.

డీసీపీ రాజ మహేంద్ర నాయక్ మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తి జీవితానికే కాకుండా కుటుంబం, సమాజాన్ని కూడా దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఈగల్ టీమ్ ద్వారా డ్రగ్స్ కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సమావేశం అనంతరం వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, తాగునీటి ట్యాంకులు, ట్రాన్స్‌ఫార్మర్లు, వంతెనలు వంటి సమస్యలపై వినతులు అందించారు. సంబంధిత అధికారులు వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి పథకాల అమలు తీరుపై వివరాలు తెలుసుకున్నారు.



# ప్రజాపాలనతో సమగ్రాభివృద్ధి సాధ్యం

- నిర్మల్‌లో జిల్లా స్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం
- 99 రోజుల కార్యాచరణతో ప్రభుత్వ సేవలకు వేగం

**నిర్మల్, మే 22 మన ప్రజాగళం:**
ప్రజల భాగస్వామ్యంతో అమలు చేస్తున్న "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" ద్వారా రాష్ట్రంలో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. జ్యోతి ప్రజ్వలన, తెలంగాణ రాష్ట్ర గీతంతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రజలకు పారదర్శక పరిపాలన అందించడమే లక్ష్యంగా కొనసాగుతోందన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారని తెలిపారు. ప్రజల అవసరాలు, సమస్యలను గుర్తించి తక్షణ పరిష్కారాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, విద్య, వైద్యం, రహదారి భద్రతపై "అరైవ్ అలైవ్" కార్యక్రమాలు, రైతు వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సేవలు వేగంగా అందించే దిశగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులకు విద్యా సదుపాయాలు, రైతులకు అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో ప్రజలకు అందుతున్న సేవలు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుధ్య కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా నివేదికలు సమర్పించారు. ప్రజలకు సేవలు మరింత చేరువ కావడానికి సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని కూడా పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, గ్రామీణాభివృద్ధి, మహిళా సంక్షేమం, పారిశుధ్యం తదితర రంగాలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అధికారులు వివరాలు అందించారు. పథకాల అమలు విధానం, అర్హతలు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా అభివృద్ధిలో ప్రతి శాఖ కీలక పాత్ర పోషించాలని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.



మన తెలుగు దిన పత్రిక ప్రజా గళం

శనివారం 23 మే 2026

# ప్రజాపాలన సమావేశంలో ప్రశంసల వెల్లువ

- మెగా జాబ్ మేళా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం
- చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామ పంచాయితీలకు ప్రశంసలు



**ఆదిలాబాద్, మే 22 మన ప్రజాగళం:** జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' జిల్లా స్థాయి సమావేశానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ ప్రజాపాలన కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా ద్వారా ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా యువతకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. వివిధ సంస్థల్లో ఎంపికైన అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేశారు. పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కూడా కార్యక్రమంలో ప్రత్యేకంగా సన్మానించారు. ప్రశంస పత్రాలు, పుస్తకాలను అందజేసి వారి ప్రతిభను అభినందించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని అతిథులు సూచించారు. బాల్య వివాహాల నిర్మూలనలో ఆదర్శంగా నిలిచిన గ్రామ పంచాయితీలకు కూడా ప్రశంస పత్రాలు అందజేశారు. చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ గ్రామాలుగా నిలిచిన పంచాయితీల సేవలను కొనియాడారు. సమాజంలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధి, విద్య, సామాజిక సంక్షేమ రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లా అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.



# రైల్వే స్టేషన్లలో 24 గంటల పోలీస్ నిఘా

**అంతర్‌రాష్ట్ర దొంగలపై వరంగల్ పోలీసుల ప్రత్యేక చర్యలు**

**వరంగల్, కాజీపేట స్టేషన్లలో ప్రత్యేక బృందాలు**

**ఫేస్ రికగ్నిషన్‌తో నేరగాళ్ల గుర్తింపు**



**వరంగల్, మే 22 మన ప్రజాగళం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అంతర్‌రాష్ట్ర దొంగల కార్యకలాపాలు పెరుగుతున్న నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన నేరగాళ్లు రైలు మార్గాల ద్వారా వరంగల్, కాజీపేట ప్రాంతాలకు చేరుకుని ఇండ్ల చోరీలు, చైన్ స్నాచింగ్ ఘటనలకు పాల్పడుతున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్లలో 24 గంటలపాటు ప్రత్యేక పోలీస్ నిఘా కొనసాగుతోంది. దేశంలోని పలు రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర బిందువులుగా మారిన వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లను నేరగాళ్లు ప్రధాన మార్గాలుగా ఉపయోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చోరీలకు పాల్పడిన అనంతరం అదే రైలు మార్గం ద్వారా తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోతున్నట్లు వెల్లడించారు. ఈ తరహా నేరాలను అరికట్టేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రణాళికలో భాగంగా క్రైమ్స్ అదనపు డీసీపీ బాలస్వామి, సీసీఎస్ ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. రెండు బృందాలు చొప్పున వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సహకారంతో ఈ బృందాలు నిరంతరం తనిఖీలు చేపడుతున్నాయి. ప్రత్యేక బృందాలు రైళ్లలో ప్రయాణిస్తున్న అనుమానితులను గుర్తించి వారి సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాయి. వారి పూర్తి వివరాలు సేకరించి వేలిముద్రలు, ముఖచిత్రాలను ఫేస్ రికగ్నిషన్ సాంకేతికత ద్వారా పరిశీలిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న నేరస్థుల డేటాబేస్‌తో ఈ వివరాలను అనుసంధానం చేసి అనుమానితులపై సమాచారం సేకరిస్తున్నారు. తనిఖీల్లో గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల వివరాలు గుర్తించిన వెంటనే పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. తనిఖీల సమయంలో అనుమానితుల పూర్తి వివరాలను రికార్డుల రూపంలో భద్రపరుస్తున్నారు. ప్రతి బృందంలో నలుగురు సభ్యులు షిఫ్ట్‌ల వారీగా విధులు నిర్వహిస్తూ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. అంతర్‌రాష్ట్ర దొంగల కదలికలను ముందుగానే గుర్తించి నేరాలను అరికట్టడమే ఈ ప్రత్యేక చర్యల ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# జనగామలో భారీ అగ్నిప్రమాదం

**ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసిన మంటలు**

**పొలాల్లో దగ్ధమైన వ్యవసాయ పరికరాలు**

**రూ.10 లక్షల ఆస్తి నష్టం అంచనా**

**జనగామ, మే 22 మన ప్రజాగళం:** జనగామ జిల్లా చిల్పూర్ మండలం నష్కల్ గ్రామంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగిసిన నిప్పురవ్వలు సమీపంలోని పంట పొలాలపై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మండుతున్న ఎండలు, వడగాలుల తీవ్రత కారణంగా మంటలు వేగంగా వ్యాపించి గ్రామస్తులను భయాందోళనకు గురిచేశాయి. స్థానికుల సమాచారం ప్రకారం మధ్యాహ్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నుంచి నిప్పురవ్వలు ఎగిసిపడ్డాయి. ఆ సమయంలో పొలాల్లో ఎండిపోయిన గడ్డి, పంట అవశేషాలు ఉండటంతో మంటలు ఒక్కసారిగా వ్యాపించాయి. కొద్ది నిమిషాల్లోనే అగ్నిజ్వాలలు పెద్ద ఎత్తున వ్యాపించి సమీప వ్యవసాయ భూములను చుట్టుముట్టాయి. మంటల కారణంగా వ్యవసాయ మోటార్లు, పైపులు, స్టార్టర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే గడ్డివాములు కూడా మంటల్లో కాలిపోయాయి. రైతులు తీవ్రంగా శ్రమించి సేకరించిన పశుగ్రాసం అగ్నికి ఆహుతి కావడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంటలను అదుపు చేసేందుకు గ్రామస్తులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ వేగంగా వ్యాపించిన మంటల కారణంగా పెద్ద నష్టం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. స్థానికులు, అధికారులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదం మరింత విస్తరించకుండా అప్రమత్తంగా వ్యవహరించడంతో సమీప ఇళ్లకు ప్రమాదం తప్పినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ పరికరాలు, మోటార్లు, పైపులు కాలిపోవడంతో రైతులు తీవ్ర నష్టపోయారు. ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. వేసవి కాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు మరింత కట్టుదిట్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా ఘటనపై విచారణ చేపట్టినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



# రేగోడ్ పోలీస్ స్టేషన్‌పై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

**రికార్డులు ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశాలు**

- పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారంపై దృష్టి
- నేర నియంత్రణకు సీసీ కెమెరాల విస్తరణ సూచన




**మెదక్, మే 22 మన ప్రజాగళం:** మెదక్ జిల్లా ఎస్పీ డి వి శ్రీనివాసరావు రేగోడ్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసుల వివరాలు, భద్రతా ఏర్పాట్లను సమగ్రంగా పరిశీలించి పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌లోని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఎస్పీ ఆదేశించారు. కేసుల నమోదు, దర్యాప్తు వివరాలు, నేరస్థుల సమాచారం వంటి అంశాలను పద్ధతిగా నిర్వహించాలని సూచించారు. పరిపాలనా వ్యవస్థలో పారదర్శకత, సమర్థత ఉండేలా అధికారులు పనిచేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. దర్యాప్తులను వేగవంతం చేసి బాధితులకు త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును ప్రాధాన్యతగా తీసుకుని నేరస్థులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై నిఘా పెంచి నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాల అమలుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో నేర నియంత్రణకు సీసీ కెమెరాల విస్తరణ ఎంతో అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రధాన కూడళ్లు, ప్రజా రద్దీ ప్రాంతాల్లో మరిన్ని కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి నేరాలను అరికట్టే దిశగా పోలీసులు పనిచేయాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి వ్యక్తితో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించి పోలీసులపై విశ్వాసం పెంచేలా పనిచేయాలని ఆదేశించారు.

# చింతలకుంట అండర్‌పాస్ పనులపై ఎమ్మెల్యే ఆగ్రహం

**ఆలస్యంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు**

**యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**ప్రజల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**




**హైదరాబాద్, మే 22 మన ప్రజాగళం:** : చింతలకుంట అండర్‌పాస్‌లో కొనసాగుతున్న మరమ్మతు పనులను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనులు ఆలస్యంగా సాగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ రద్దీ పెరిగి ప్రజలు గంటల తరబడి ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అండర్‌పాస్ మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యంతో స్థానిక ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రతిరోజూ ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రద్దీ సమయాల్లో వాహనాల క్యూలు భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన యంత్రాలు, సిబ్బందిని పెంచి వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. చింతలకుంట అండర్‌పాస్ నగర రవాణాలో కీలక మార్గమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మార్గంలో రోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. అందువల్ల మరమ్మతు పనులు త్వరగా పూర్తికాకపోతే ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే ప్రమాదం ఉందన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులను ఎమ్మెల్యే హెచ్చరించారు. తాత్కాలిక పరిష్కారాలకంటే దీర్ఘకాలిక ప్రయోజనం కలిగే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం రాకముందే పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు పనుల పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటుపైనా దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.

# జిల్లాలో ఘనంగా ఈత పోటీలు ప్రారంభం




**ఆదిలాబాద్, మే 21 మన ప్రజాగళం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక" తొంభై తొమ్మిది రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా స్థాయి ఈత పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో పోటీలను అధికారికంగా ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉత్సాహపరిచిన ఆయన క్రీడల్లో యువత చురుకుగా పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడలకు ప్రాధాన్యం కల్పిస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఈత పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కూడా సాధ్యమవుతుందని తెలిపారు. పోటీలు యువతకు మరింత ఉత్సాహాన్ని అందిస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. క్రీడా శిక్షకులు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పోటీలు నిర్వహించి యువతలో క్రీడా ఆసక్తిని పెంచేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు.

# హెల్త్

## పచ్చి మామిడికాయతో ఆరోగ్యానికి ఆరు అద్భుత లాభాలు

- వేసవిలో శరీరానికి సహజ రక్షణగా పచ్చి మామిడి
- జీర్ణక్రియ నుంచి గుండె ఆరోగ్యం వరకు ఎన్నో ప్రయోజనాలు

వేసవి కాలం వచ్చిందంటే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది మామిడి పండు. తియ్యగా, రసవంతంగా ఉండే పండిన మామిడి ఎంత ఇష్టమో, పుల్లగా ఉండే పచ్చి మామిడికాయ కూడా అంతే ప్రత్యేకతను సొంతం చేసుకుంది. ఉగాది పచ్చడి నుంచి ఆవకాయ వరకు, చట్నీల నుంచి చల్లని పానీయాల వరకు ప్రతి ఇంట్లో పచ్చి మామిడికాయ వినియోగం ఎక్కువగా కనిపిస్తుంది. అయితే ఇది కేవలం రుచికోసం మాత్రమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పచ్చి మామిడికాయలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె, విటమిన్ బి ఆరు వంటి పోషకాలతో పాటు పీచుపదార్థం, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తాయి. వేసవిలో దీన్ని ఆహారంలో చేర్చుకోవడం వల్ల శరీరానికి చల్లదనంతో పాటు రక్షణ కూడా లభిస్తుంది. జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారికి పచ్చి మామిడికాయ మంచి సహాయకారిగా పనిచేస్తుంది. ఇందులో ఉండే పీచుపదార్థం జీర్ణక్రియ వేగంగా జరిగేలా చేస్తుంది. మలబద్ధకం, కడుపు ఉబ్బరం, ఎసిడిటీ వంటి సమస్యలను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుంది. వేసవిలో వేడి కారణంగా వచ్చే జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలిగించడంలో పచ్చి మామిడి పాత్ర ముఖ్యమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చర్మం, జుట్టు ఆరోగ్యానికి కూడా ఇది మేలు చేస్తుంది. ఇందులోని విటమిన్ సి శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మానికి మెరుపు తీసుకువస్తుంది. అలాగే ఐరన్, జింక్ వంటి పోషకాలు జుట్టు కుదుళ్లను బలపరిచి జుట్టు రాలే సమస్య తగ్గించడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా పచ్చి మామిడికాయ ఉపయోగపడుతుంది. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని హానికర కణాలతో పోరాడతాయి. అలాగే ఫైబర్, పొటాషియం రక్తపోటును నియంత్రించి రక్తప్రసరణను మెరుగుపరచడంలో తోడ్పడతాయి. తక్కువ గ్లైసెమిక్ స్థాయి ఉండటం వల్ల మధుమేహంతో బాధపడేవారు కూడా పరిమితంగా తీసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. వేసవిలో ఎండ తీవ్రత వల్ల శరీరంలో నీటి శాతం తగ్గి అలసట, నీరసం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటి సమయంలో పచ్చి మామిడికాయను కొద్దిగా ఉప్పుతో తీసుకోవడం లేదా దానితో తయారు చేసిన పానీయాలు తాగడం వల్ల శరీరంలోని లవణాల సమతుల్యత మెరుగ్గా ఉంటుంది. అయితే ఆరోగ్యానికి ఎంత మేలు చేసినా అతిగా తీసుకోవడం మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కాయ నుంచి వచ్చే జిగురు నోటికి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



## పెట్రోల్, మట్టి వాసనలు ఎందుకు నచ్చుతాయి?



కొందరికి వర్షం పడిన తర్వాత వచ్చే తడి మట్టి వాసన చాలా ఇష్టం. మరికొందరికి పెట్రోల్ బంక్ దగ్గరికి వెళ్లినప్పుడు వచ్చే పెట్రోల్ వాసన నచ్చుతుంది. ఇంకొందరు కొత్త ఇంటికి వేసిన పెయింట్ వాసనను ఆస్వాదిస్తుంటారు. అయితే ఇవన్నీ ఎందుకు మనకు ఆకర్షణీయంగా అనిపిస్తాయనే ప్రశ్న చాలామందిలో ఉంటుంది. దీనికి కారణం కేవలం ముక్కు కాదు, మన మెదడు కూడా కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మనం పీల్చే ప్రతి వాసన ముక్కులోని గ్రాహక కణాల ద్వారా మెదడుకు చేరుతుంది. అక్కడ అవి భావోద్వేగాలు, జ్ఞాపకాలు, అనుభవాలతో అనుసంధానం అవుతాయి. అందుకే ఒకే వాసన కొందరికి ఎంతో ఇష్టంగా అనిపిస్తే, మరికొందరికి అస్సలు నచ్చకపోవచ్చు. చిన్ననాటి జ్ఞాపకాలు, ప్రకృతితో అనుబంధం, కొన్ని ప్రత్యేక అనుభవాలు కూడా వాసనలపై ఇష్టాన్ని ప్రభావితం చేస్తాయి. వర్షం పడిన తర్వాత వచ్చే మట్టి వాసనకు ప్రత్యేక శాస్త్రీయ కారణం ఉంది. నేలలో ఉండే సూక్ష్మజీవులు విడుదల చేసే పదార్థాలు వర్షపు నీటితో గాల్లోకి వ్యాపిస్తాయి. ఈ ప్రత్యేక వాసనను శాస్త్రవేత్తలు పెట్రికోర్ అని పిలుస్తారు. ప్రకృతి, చల్లదనం, సేదతీరే అనుభూతిని ఈ వాసన గుర్తు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. పెట్రోల్ వాసనలో ఉండే కొన్ని రసాయనాలు ముక్కు ద్వారా మెదడుపై ప్రభావం చూపుతాయి. కొందరికి అది కొత్తదనంగా, మరికొందరికి ప్రయాణ జ్ఞాపకాలతో ముడిపడి ఉండొచ్చు. అలాగే కొత్త ఇంటి పెయింట్ వాసన కూడా కొత్త ప్రారంభం, ఆనందకర అనుభవాలను గుర్తుచేయడం వల్ల ఇష్టంగా అనిపించే అవకాశం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. అయితే పెట్రోల్, పెయింట్ వంటి వాసనలను ఎక్కువగా పీల్చడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వాటిలోని రసాయనాలు తలనొప్పి, తల తిరగడం, శ్వాస సమస్యలు కలిగించే అవకాశం ఉంటుంది. ఒకవేళ అలాంటి వాసనలు తరచూ పీల్చాలనే కోరిక ఎక్కువైతే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## మహిళల్లో హార్మోన్ల సమస్యలు పెరుగుతున్నాయా?

- పేగుల ఆరోగ్యం కీలకం
- కాలేయం పనితీరు మెరుగైతే మార్పులు
- ఆహారంతోనే సమతుల్యత సాధ్యమా?





నేటి జీవనశైలి, మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గిపోవడం వంటి కారణాలతో మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత సమస్యలు రోజురోజుకీ పెరుగుతున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చాలా మంది నేరుగా సప్లిమెంట్లు, ప్రత్యేక ఉత్పత్తుల వైపు వెళ్లిపోతున్నప్పటికీ శరీరం ముందుగా సిద్ధంగా లేకపోతే అవి ఆశించిన ప్రయోజనం ఇవ్వకపోగా సమస్యలను మరింత పెంచే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. శరీరంలో స్త్రీ హార్మోన్‌లను విచ్ఛిన్నం చేసి బయటకు పంపే ప్రధాన బాధ్యత కాలేయానిదేనని నిపుణులు చెబుతున్నారు. మొదట కాలేయం హార్మోన్‌లను విడదీసి, తరువాత శరీరం నుంచి బయటకు వెళ్లే విధంగా ప్రాసెస్ చేస్తుంది. ఈ ప్రక్రియ మందగిస్తే అవి పూర్తిగా బయటకు వెళ్లకుండా మళ్లీ శరీరంలోనే చేరే పరిస్థితి ఏర్పడుతుందని వివరిస్తున్నారు. ఈ సమస్యను సరిచేయాలంటే ముందుగా పేగుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజుకు ఇరవై ఐదు నుంచి ముప్పై ఐదు గ్రాముల పీచు పదార్థం తీసుకోవడం జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుందని చెబుతున్నారు. అరటిపండ్లు, మునగ ఆకులు, మెంతులు, అవిసె గింజలు వంటి ఆహారాలు ఈ విషయంలో ఉపయోగపడతాయని సూచిస్తున్నారు. పేగుల ఆరోగ్యం మెరుగుపడిన తరువాత కాలేయానికి అవసరమైన పోషకాలను అందించడం కూడా చాలా ముఖ్యమని చెబుతున్నారు. గుడ్లు, ప్రత్యేక పుట్టగొడుగులు, ఉల్లిపాయ, వెల్లుల్లి, ఆకుకూరలు, ఉడికించిన పప్పులు కాలేయ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇంట్లో తయారుచేసిన పెరుగు, పులియబెట్టిన ఆహారాలు కూడా జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయని సూచిస్తున్నారు. అలాగే శరీరంలో హార్మోన్‌లు మళ్లీ శోషించబడకుండా నిరోధించడం కూడా చాలా అవసరమని చెబుతున్నారు. నారింజ, యాపిల్ వంటి పండ్లలో ఉండే సహజ పదార్థాలు ఈ ప్రక్రియకు తోడ్పడతాయని వెల్లడిస్తున్నారు. పేగులలోని కొన్ని ఎంజైమ్‌ల పనితీరును నియంత్రించడం ద్వారా అవి తిరిగి శరీరంలోకి చేరకుండా అడ్డుకుంటాయని వివరిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ముందుగా పేగులు, కాలేయం, వ్యర్థాల తొలగింపు వ్యవస్థ సరిగా పనిచేసేలా చూసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా మలబద్ధకం ఉన్నవారిలో హార్మోన్ల సమస్యలు మరింత తీవ్రం కావచ్చని హెచ్చరిస్తున్నారు. శరీర ఆరోగ్యానికి మూలం జీర్ణవ్యవస్థేనని, ఆహారపు అలవాట్లలో మార్పులు తీసుకురావడం ద్వారా చాలా సమస్యలను నియంత్రించే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు.

# బిజినెస్

## పెట్రోల్ ధరల సెగ డెలివరీ ఛార్జీలు పెరిగే సూచనలు




**న్యూఢిల్లీ, మే 21 మన ప్రజాగళం న్యూస్ :** ప్రస్తుతం పది నిమిషాల్లో ఇంటికే సరుకులు, ఆహారం అందించే క్విక్ కామర్స్ సేవలు ప్రజల జీవితంలో భాగమయ్యాయి. బిర్యానీ నుంచి కూరగాయల వరకు అన్నీ మొబైల్ యాప్‌ల ద్వారా చిటికెలో ఇంటి ముందుకు చేరుతున్నాయి. అయితే తరచూ ఆన్‌లైన్ ఆర్డర్లు చేసే వినియోగదారులకు త్వరలోనే అదనపు భారం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెరుగుతున్న పెట్రోల్ ధరల ప్రభావంతో డెలివరీ ఛార్జీలు పెరిగే పరిస్థితులు ఏర్పడుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగడం వల్ల దేశీయంగా ఇంధన ధరలు ఇటీవల పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సుమారు నాలుగు రూపాయల వరకు పెరుగుదల నమోదైనట్లు సమాచారం. ఈ ప్రభావం ఆహార సరఫరా, క్విక్ కామర్స్ సంస్థలపై పడుతోందని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ ఎలారా రాజధాని తన తాజా నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం ప్రస్తుతం క్విక్ కామర్స్ విభాగంలో ఒక్కో ఆర్డర్ డెలివరీ చేయడానికి కంపెనీలకు సుమారు 35 నుంచి 50 రూపాయల వరకు ఖర్చవుతోంది. ఆహార సరఫరా సేవల్లో ఈ వ్యయం మరింత ఎక్కువగా ఉండి ఒక్కో ఆర్డర్‌కు 55 నుంచి 60 రూపాయల వరకు వెళ్తోందని అంచనా. సగటున చూస్తే స్విగ్గీ వంటి సంస్థలకు ఒక్కో డెలివరీపై భారీ ఖర్చు పడుతోందని నివేదిక చెబుతోంది. ఈ డెలివరీ ఖర్చులో దాదాపు 20 శాతం వరకు కేవలం ఇంధన వ్యయమే ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. పెట్రోల్ ధరలు మరింత పెరిగితే కంపెనీలు అదనపు భారం వినియోగదారులపై మోపే అవకాశముందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. దీంతో రాబోయే రోజుల్లో డెలివరీ ఛార్జీలు పెరగవచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

## ఎయిర్‌టెల్ ప్రత్యేక పోస్ట్‌పెయిడ్ ప్లాన్లు




**న్యూఢిల్లీ, మే 21 మన ప్రజాగళం న్యూస్ :** ప్రముఖ టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్ అనంతర చెల్లింపు వినియోగదారుల కోసం 'ప్రాధాన్య అనంతర చెల్లింపు' పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది. ఈ సేవల ద్వారా వినియోగదారులకు అంతరాయం లేని, మరింత నమ్మకమైన అనుసంధానం అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఐదో తరం మొబైల్ నెట్‌వర్క్‌లో ఉపయోగించే ప్రత్యేక సాంకేతిక విధానంలో భాగంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది. దేశంలో ఈ తరహా సరికొత్త సేవలను ప్రారంభించిన తొలి టెలికాం సంస్థగా ఎయిర్‌టెల్ నిలిచిందని సంస్థ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి శశ్వత్ శర్మ పేర్కొన్నారు. ప్రస్తుతం ఎయిర్‌టెల్ అనంతర చెల్లింపు సేవలను వినియోగిస్తున్న ఖాతాదారులు స్వయంచాలకంగా ఈ కొత్త సేవల పరిధిలోకి వస్తారని సంస్థ తెలిపింది. ఇక ముందస్తు చెల్లింపు వినియోగదారులు లేదా ఇతర నెట్‌వర్క్ వినియోగదారులు ఈ సేవలను పొందాలంటే ఎయిర్‌టెల్ అనువర్తనం లేదా సమీప కేంద్రాలను సంప్రదించాలని సూచించింది. ఈ కొత్త పథకాలు 449 రూపాయల నుంచి 1,749 రూపాయల వరకు అందుబాటులో ఉండనున్నాయి. ఆయా పథకాలలో అపరిమిత కాల్స్, అపరిమిత డేటాతో పాటు మూడు వేల సందేశాల సౌకర్యం, అవాంఛిత కాల్స్ హెచ్చరిక సేవలు కూడా లభించనున్నాయి. అదనంగా ప్రముఖ వినోద వేదికల సభ్యత్వాలను కూడా వినియోగదారులు పొందే అవకాశం కల్పిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇప్పటికే అమెరికా, సింగపూర్, బ్రిటన్, మలేషియా వంటి పలు దేశాల్లో సంస్థ ఐదో తరం సేవలను ప్రారంభించినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది.

## వారంలో రెండు రోజులు ఇంటి నుంచే పని


**ముంబై, మే 21 మన ప్రజాగళం న్యూస్ :** దేశంలో పెరుగుతున్న ఇంధన సంక్షోభం, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించాలన్న కేంద్ర ప్రభుత్వ పిలుపు నేపథ్యంలో ప్రైవేటు బ్యాంకింగ్ రంగ దిగ్గజం హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగులకు వారంలో రెండు రోజుల పాటు ఇంటి నుంచే పనిచేసే అవకాశం కల్పిస్తూ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్పొరేట్ సంస్థలు ఇంధన పొదుపు కోసం 'ఇంటి నుంచే పని' విధానాన్ని ప్రోత్సహించాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా స్పందించి ఉద్యోగుల కోసం ప్రత్యేక సౌకర్యాన్ని ప్రకటించింది. బ్యాంకు విడుదల చేసిన వివరాల ప్రకారం కస్టమర్లతో నేరుగా సంబంధం లేని వ్యాపార, కార్పొరేట్ బ్యాంకింగ్ విభాగాలకు చెందిన ఉద్యోగులకు ఈ సౌకర్యం వర్తించనుంది. వారంలో రెండు రోజులు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. ఈ విధానం తక్షణమే అమల్లోకి వస్తుందని తెలిపింది. అయితే ఈ నిర్ణయాన్ని మొదటగా నెల రోజుల పాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు బ్యాంకు పేర్కొంది. ఉద్యోగుల పనితీరు, సేవల నాణ్యత, కార్యాచరణ సామర్థ్యాన్ని పరిశీలించిన తర్వాత దీన్ని శాశ్వతంగా కొనసాగించాలా వద్దా అన్న అంశంపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు స్పష్టం చేసింది. ట్రెజరీ కార్యకలాపాలు, అంతర్గత లావాదేవీలు, డిజిటల్ బ్యాంకింగ్, మానవ వనరుల విభాగం, ఆర్థిక లెక్కల విభాగం వంటి కొన్ని ప్రత్యేక శాఖల ఉద్యోగులకు మాత్రమే ఈ సదుపాయం వర్తించనుంది. మరోవైపు బ్రాంచ్‌లలో కస్టమర్లతో ప్రత్యక్షంగా పనిచేసే నగదు కౌంటర్, ముందస్తు సేవల విభాగాల ఉద్యోగులకు ఈ సౌకర్యం ఉండదని బ్యాంకు తెలిపింది. ఇంటి నుంచే పని చేసినా బ్యాంకు సేవల్లో ఎలాంటి అంతరాయం ఉండదని, అత్యాధునిక సాంకేతిక వసతులతో వినియోగదారులకు నిరంతర సేవలు అందిస్తామని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది.

## బంగారం పెరిగింది.. వెండి భారీగా తగ్గింది



**హైదరాబాద్, మే 21 మన ప్రజాగళం న్యూస్ :** దేశంలో బంగారం, వెండి ధరలు మరోసారి భారీ హెచ్చుతగ్గులకు లోనయ్యాయి. ఇటీవల పసిడి ధరలు తగ్గుముఖం పట్టగా, ఇప్పుడు మళ్లీ ఒక్కసారిగా పెరిగాయి. మరోవైపు వెండి ధర మాత్రం అనూహ్యంగా భారీగా పడిపోయింది. నేటి ఉదయం మార్కెట్ పరిస్థితులను పరిశీలిస్తే హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,310 పెరిగి రూ.1,58,350కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,200 పెరిగి రూ.1,45,150గా నమోదైంది. వెండి ధరలో మాత్రం భారీ పతనం కనిపించింది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ఏకంగా రూ.15 వేల మేర తగ్గి రూ.2.85 లక్షలకు చేరింది. ఇతర ప్రధాన నగరాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,58,350గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,45,150గా నమోదైంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,58,500కు చేరుకోగా, 22 క్యారెట్ల బంగారం రూ.1,45,300గా ఉంది. వెండి ధరలు నగరాల వారీగా మారుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కిలో వెండి రూ.2.85 లక్షలుగా ఉండగా, మరికొన్ని నగరాల్లో రూ.2.80 లక్షల వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పులు, డాలర్ మారకం విలువ, దిగుమతి సుంకాలు వంటి అంశాల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ప్రతిరోజూ మారుతున్నాయని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.

## లాభాల్లో ముగిసిన సూచీలు




**ముంబై, మే 21 మన ప్రజాగళం న్యూస్ :** ఉదయం భారీ నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు మధ్యాహ్నం తర్వాత బలంగా కోలుకున్నాయి. ఇంట్రాడే కనిష్ఠాలతో పోలిస్తే సెన్సెక్స్ దాదాపు 800 పాయింట్లు పుంజుకోవడం గమనార్హం. కనిష్ఠ స్థాయిల వద్ద పెట్టుబడిదారులు కొనుగోళ్లకు ఆసక్తి చూపడం మార్కెట్లకు ఊతమిచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర బ్యారెల్‌కు 110 డాలర్ల దిగువకు రావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతున్నాయన్న సంకేతాలు కూడా సానుకూల ప్రభావం చూపించాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ చివరకు లాభాలతో ముగిశాయి. గత ట్రేడింగ్ ముగింపుతో పోలిస్తే ఉదయం సెన్సెక్స్ దాదాపు 400 పాయింట్ల నష్టంతో ప్రారంభమై మరింత దిగజారింది. అయితే మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పుంజుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 117 పాయింట్లు పెరిగి 75,318 వద్ద ముగియగా, నిఫ్టీ 41 పాయింట్లు లాభపడి 23,659 వద్ద స్థిరపడింది. షేర్ల పరంగా చూస్తే హిటాచీ ఎనర్జీ, ఏబీబీ ఇండియా, సీజీ పవర్, సీమన్స్, మ్యాన్‌కైండ్ ఫార్మా వంటి సంస్థల షేర్లు మంచి లాభాలు నమోదు చేశాయి. మరోవైపు పీఐ ఇండస్ట్రీస్, కేన్స్ టెక్నాలజీ, ఎల్‌టీఐఎమ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, భారత్ ఎలక్ట్రికల్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్యాంక్ నిఫ్టీ 153 పాయింట్లు పెరగగా, నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 301 పాయింట్లు ఎగసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 96.82 వద్ద కొనసాగుతోంది.